క్లుప్తంగా

మహాశివరాత్రికి ప్రత్యేక పూజలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ ఉప ఆలయమైన శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక బుధవారం తెలిపారు. ఉదయం 5 నుంచి 11 గంటల వరకు పంచామృతాభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నాభిషేకం, రాత్రి 10.30 గంటలకు స్వామివారికి శాంతి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరుపుతామన్నారు. 27న ఉదయం 9 గంటలకు స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. స్వామి వారి శాంతి కల్యాణోత్సవంలో పాల్గొన దలచిన భక్తులు ముందుగా ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని ఈఓ సూచించారు.

కొనసాగుతున్న ఆధార్ నమోదు క్యాంపులు



కంకిపాడు: ఆధార్ నమోదు క్యాంపులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మండలంలోని కంకిపాడు సచివాలయం, పునాదిపాడు సచివాలయాల్లో 0–6 ఏళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నారు. శిబిరాన్ని బుధవారం డీఎల్‌డీఓ రాజేష్ పరిశీలించారు. క్యాంపులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు.

నేడు, రేపు ఉప్పలూరులో..
మండలంలోని ఉప్పలూరు సచివాలయంలో ఈనెల 20, 21 తేదీల్లో ఆధార్ నమోదు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఆయా గ్రామాల్లోని 0–6 ఏళ్ల లోపు చిన్నారులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు భద్రావతి సమేత భావన రుషి స్వామి వార్ల కల్యాణోత్సవం

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో వేం చేసి ఉన్న శ్రీభద్రావతి సమేత భావనరుషిస్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 20వ తేదీ గురువారం వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం స్వామివారికి అభిషేకాలు, నూతన వస్త్ర సమర్పణ జరుగుతుందన్నారు. అనంతరం ఉదయం 11.45 గంటలకు సుముహూర్తంలో శ్రీభదావతి సమేత భావనరుషిస్వామి వార్ల కల్యాణోత్సవం. సాయంత్రం స్వామివార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు జరుగుతుందన్నారు. ఉత్సవాల్లో కేసరపల్లి పరిసరా గ్రామాల భక్తులు పాల్గొనాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఉంగుటూరు: చెన్నై – కోల్‌కతా జాతీయ రహదారిపై తేలప్రోలు వద్ద ఆగి ఉన్న మినీ వ్యాన్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆత్కూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన కె.రాజేష్ 15 ఏళ్లుగా గన్నవరంలో ఫిజియోథెరపీస్ట్‌గా చేస్తున్నాడు. హనుమాన్‌జంక్షన్‌లో ఫిజియోథెరపీ చేసేందుకు మంగళవారం రాత్రి బైక్‌పై వెళ్తున్నాడు. తేలప్రోలులో జాతీయ రహదారి పక్కన మినీ వ్యాన్ బ్రేక్‌డౌన్ కావడంతో ఆపి రిపేరు చేస్తున్నారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న రాజేష్ ప్రమాదవశాత్తు ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కావడంతో స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో చిన్న అవుటపల్లిలోని పిన్నమనేని ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ చావా సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జన్యువుల్లో మార్పులు, చేర్పులు చేయొచ్చు

శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస.కె.రావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రిస్పర్ –కాస్ 9 టెక్నాలజీతో జన్యువుల్లో మార్పులు, చేర్పులు చేయొచ్చని, దీనిని జంతు, వృక్ష శాస్త్రాల్లో ఉపయోగించారని శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస.కె.రావు తెలిపారు. ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల సుశ్రుత హాలులో బుధవారం అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రీనివాస.కె.రావు మాట్లాడుతూ.. మానవుల శాంపిల్స్‌లో క్రిస్పర్–కాస్ 9 టెక్నాలజీ ఉపయోగించి జీన్ ఎడిటింగ్ ద్వారా సికిల్ సెల్ ఎనీమియా వంటి జన్యుపరమైన వ్యాధులను మటుమాయం చేయవచ్చన్నారు. భవిష్యత్‌లో దీనిని ఉపయోగించి పుట్టుకకు ముందే వ్యాధి కారక జన్యువులను మార్చడం ద్వారా ఆరగ్యకరమైన కణజాలాన్ని పిండదశలోనే పెంపొందించవచ్చని వివరించారు. న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.వి.మాధవికుమారి మాట్లాడుతూ.. గిలియన్ బ్యారీ సిండ్రోమ్ గురించి ప్రస్తుతం ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ వ్యాధి కారకాలు, లక్షణాలు, నిర్ధారించే పరీక్షలు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్స గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ విజయశ్రీ, ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ కొణిదె రవి పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయిన్ల నిర్వహణ

- వ్యర్థాలతో నిండి, పూడుకుపోయిన డ్రెయినేజీలు
- విజృంభిస్తున్న దోమలు
- మొక్కుబడిగా దోమల నిర్మూలన చర్యలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు



వ్యర్థాలతో నిండిన కంకిపాడు పట్టణంలోని ప్రధాన డ్రెయిన్

కంకిపాడు: కంకిపాడు పట్టణంలో డ్రెయినేజీల నిర్వహణ అధ్వానంగా మారింది. డ్రెయిన్లు వ్యర్థాలతో నిండి, పూడుకుపోతున్నా పట్టించుకునే నాథుడేలేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయిన్లు పూడుకుపోవడంతో మురుగు పారుదల సజావుగా సాగటం లేదు. ఎక్కడి వ్యర్థాలు అక్కడే నిలిచిపోతున్నాయి. ఫలితంగా దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారటంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. దోమల నిర్మూలనకు అధికారులు తీసుకుంటున్న చర్యలు మొక్కుబడిగా ఉంటున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. మండల కేంద్రమైన కంకిపాడు పట్టణం అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పెనమలూరు, కంకిపాడు, ఉంగుటూరు మండలాల్లోని 40 గ్రామాలకు ప్రధాన కేంద్రంగా కంకిపాడు పట్టణం ఉంది. ఆయా గ్రామాల ప్రజలు వస్త్ర, బంగారు, వ్యవసాయ, వ్యాపార అవసరాలకు నిత్యం కంకిపాడు పట్టణానికి వచ్చి పోవాల్సిందే.

మురుగు పారితే ఒట్టు..
పట్టణంలోని ప్రధాన డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామంలోని వివిధ ప్రాంతాలను ప్రధాన రహదారి డ్రెయినేజీకి అనుసంధానం చేస్తూ డ్రెయిన్లు నిర్మించారు. ఎలుకల తవ్వకం, వ్యర్థాలతో పూడుకుపోవటంతో మురుగునీరు సజావుగా పారుదల అవ్వటం లేదు. ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతుంది. వ్యర్థాలు పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న వ్యాపారులు డ్రెయిన్లను వ్యర్థాలకు నెలవుగా మార్చేశారు. ముఖ్యంగా హోటళ్లు, మాంసం దుకాణదారులు, కూరగాయల దుకాణదారులు, జనరల్ స్టోర్స్ నిర్వాహకులు వ్యర్థాలను డ్రెయిన్లలో పడేస్తున్నారు. దీంతో వ్యర్థాలు కుళ్లి దుర్గంధం వెలువడి తరచూ ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. హోటళ్లు, దుకాణదారులు, నిర్మాణ సామగ్రి వ్యాపారులు డ్రెయినేజీలను మూసివేసి దానిపై ప్లాట్‌ఫారాలు నిర్మించేశారు. ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించటంతో ప్రజలు నిత్యం దుర్గంధం సహవాసం చేయాల్సి వస్తుంది.

విజృంభిస్తున్న దోమలు..
డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయి, మురుగు పారుదల కాకపోవటంతో దోమల సమస్య తీవ్రంగా ఉంటోంది. పగలూ, రాత్రీ తేడా లేకుండా దోమలు విజృంభించి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల నిర్మూలనకు పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా తీసుకుంటున్న దోమల నిర్మూలన చర్యలు మొక్కుబడిగా సాగుతుండటంతో దోమల సమస్య అపరిష్కృతంగానే మిగులుతోంది. మండల పరిషత్ కార్యాలయ అధికారులు, మండల కేంద్రాన్ని పూర్తిగా విస్మరించారు. కనీసం డ్రెయినేజీలపై ఆక్రమణలు, తద్వారా నెలకొంటున్న పూడికలు, దోమల సమస్యలను పట్టించుకోవటం లేదని పట్టణ వాసులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ప్రజారోగ్య పరిరక్షణ చర్యలు తీసుకోవటంతో అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



నున్నలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి

నున్న(విజయవాడరూరల్): దాళ్వా సాగు చేసిన రైతుల సౌకర్యార్థం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారికి విజ్ఞప్తి చేశారు. నున్న గ్రామంలోని రైతు సంక్షేమ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయకుమారి హాజరయ్యారు. గతేడాది సెప్టెంబరులో వచ్చిన వరదల కారణంగా ఖరీఫ్ పంట సాగు చేసిన రైతులు నష్టపోయారన్నారు. దాళ్వా పంట సాగు చేసిన రైతులకు నున్న గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారన్నారు. దీనిపై స్పందించిన జిల్లా అధికారి మాట్లాడుతూ.. సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే రాయితీలు, పంటలకు కనీస మద్దతు ధర, పంటల భీమా, పంట రుణాలు యూనిక్ కార్డు ద్వారా అందజేస్తున్నామన్నారు.

బర్డ్ ఫ్లూపై అవగాహన..
ఏడీఏ బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులందరూ ఈ క్రాప్, ఈకేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. మండల ఉద్యానశాఖ అధికారి నీలిమా మాట్లాడుతూ మామిడిలో తామర పురుగు ఉధృతి అధికంగా ఉందన్నారు. దాని నివారణకు పసుపు, బులుగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే ఫిప్రొనీల 2 ఎంఎల్ మందును లీటరు నీటిలో లేదా స్పైపోపాడ్ 0.35 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారి ప్రసాద్ బర్డ్ ఫ్లూ వ్యాపించే తీరును తెలియజేసి, చనిపోయిన పక్షుల నుంచి వ్యాధి వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు, ఏఈఓ సురేష్ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం దేవులపల్లి మాధవరావుకు చెందిన మొక్కజొన్న పంట పొలాన్ని పరిశీలించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

మార్కెటింగ్ శాఖ ఏడీ నిత్యానందం



కంకిపాడు రైతుబజారులో సమీక్షిస్తున్న ఏడీ నిత్యానందం

కంకిపాడు: రైతుబజారులో దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ ఏడీ నిత్యానందం తెలిపారు. కంకిపాడు రైతుబజారును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుబజారులో దుకాణాలు నిర్వహిస్తున్న దుకాణదారులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గుర్తింపు కార్డులు ధరించాలని, వినియోగదారులకు సౌమ్యంగా వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం రైతుబజారు ఎస్టేట్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమీక్ష చేపట్టారు.
ఈ సందర్భంగా ఏడీ నిత్యానందం విలేకరులతో మాట్లాడుతూ రైతుబజారులో రైతుల దుకాణాలు 37కు 32 ఉన్నాయన్నారు. డ్వాక్రా దుకాణాలు 6, సొసైటీ 5, దివ్యాంగుల దుకాణాలు 4, కోడిగుడ్ల దుకాణాలు రెండు ఉన్నాయన్నారు. దుకాణదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ వినియోగదారుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తున్నారన్న ప్రశ్నకు స్పందిస్తూ వినియోగదారుల పట్ల అమర్యాదగా వ్యవహరించే దుకాణదారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్క దుకాణదారుడు నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. నాణ్యమైన కూరగాయలను విక్రయించాలని సూచించారు. పలువురు తనిఖీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు

మండల వ్యవసాయాధికారి రజని



గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వై.రజని తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రామచంద్రాపురం 134, సూరంపల్లి 207, కొండపావులూరు 258, గోపవరపుగూడెం 68, గొల్లనపల్లి 27, చిక్కవరం 262, మెట్లపల్లి 167, సగ్గూరు అమాని 46, బల్లిపర్రు 116, తెంపల్లి 262, వీరపనేనిగూడెం 248, బీబీగూడెం 42, పురుషోత్తపట్నం 261, వెదురుపావులూరు 316, సావరగూడెం 101, జక్కులనెక్కలం 69, కేసరపల్లి 216, వెంకటనరసింహాపురం 33, గన్నవరం 210, చిన అవుటపల్లి 39, అల్లాపురం 33, బుద్ధవరం 257, అజ్జంపూడి 103, బూతిమిల్లిపాడు 22 మంది రైతులు ఇప్పటికే ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకున్నట్లు తెలిపారు. మొత్తం 3497 మంది నమోదు చేయించుకున్నారన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి..
పీఎం కిసాన్ చెల్లింపులు, పెట్టుబడి సాయం, పంటల బీమా, రాయితీపై సూక్ష్మ పోషకాలు, అన్నదాత సుఖీభవ, రాయితీ పై వ్యవసాయ యంత్ర పరికరాలు, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సూక్ష్మ సేద్యంపై రాయితీ తదితర పథకాలు రైతులకు అందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి అని పేర్కొన్నారు. భూమి గల ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలు సులభతరం, పారదర్శకం, అందుబాటులోకి తీసుకురావటం లక్ష్యమన్నారు. ఆధార్ కార్డు, ఆధార్ అనుసంధానింపబడిన మొబైల్, పట్టాదారుని పాస్‌బుక్ తీసుకుని రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని ఏఓ సూచించారు..

మెరుగైన బాల్య విద్య అందించేందుకే 'జ్ఞానజ్యోతి'

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మూడు నుంచి ఆరేళ్ల మధ్య వయస్సు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన బాల్య విద్యను అందించే లక్ష్యంతోనే 'జ్ఞానజ్యోతి' కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని బాపులపాడు ఎంఈఓ శ్రీరామ్ బాలాసింగ్ చెప్పారు. స్థానిక నూజివీడు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న 120 రోజుల సర్టిఫికెషన్ కోర్సు తరగతులకు బుధవారం ఎంపీడీఓ కె.జోగేశ్వరరావుతో పాటు ఆయన హాజరయ్యారు. వినూత్న పద్ధతుల్లో అభ్యసన కార్యక్రమాలు నిర్వహించటం, విద్యా నైపుణ్యాలు పెంపొందించటం, ఉత్తేజిత వాతావరణం సృష్టించటం అనే అంశాలపై అంగన్‌వాడీ టీచర్లకు ఎంఈఓ శ్రీరామ్ బాలాసింగ్ తరగతులు బోధించారు. సంపూర్ణ పిల్లల అభివృద్ధి కోసం జాతీయ విద్యా విధానం 2020 లక్ష్యాల మేరకు బోధన, అభ్యసన పద్ధతులు నిర్వహించాలని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, శాంతి శిరీష, డీఆర్పీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



ఉయ్యూరు: చార్ట్ కౌన్సెలింగ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఉయ్యూరు ఆర్టీసీ డిపో వద్ద చేపట్టిన రిలే దీక్ష బుధవారం ఆరో రోజుకు చేరింది. చార్ట్ కౌన్సెలింగ్‌పై డీఎం ప్రసాద్ పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర కార్యాలయ ఉత్తర్వుల ప్రకారమే నడుచుకోవాలని సూచించారు. దీక్షలో యూనియన్ ప్రతినిధులు వాసు, రత్నం కూర్చున్నారు. సంఘం ప్రతినిధులు కె.ఎస్.రావు, రాము, ప్రసాద్, పిచ్చియ్య, రంగమ్మ, పార్వతి పాల్గొన్నారు.

రేపు కంకిపాడులో విద్యుత్ అదాలత్

కంకిపాడు: పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 21వ తేదీన విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ అదాలత్, విద్యుత్ అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేలు సమక్షంలో అదాలత్ జరుగుతుందన్నారు. దీర్ఘకాలిక విద్యుత్, అపరిష్కృత సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అదాలత్‌ను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల పరిషత్ అధికారులపై ఫిర్యాదు

పెనమలూరు: పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులపై పెనమలూరు గ్రామానికి చెందిన ముప్పాళ్ల బద్రినారాయణ రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారి పై విచారణ చేయాలని జిల్లా పరిషత్ సీఈఓను కమిషనర్ ఆదేశించారు. పిటీషనర్ బద్రినారాయణ పేర్కొన్న వివరాల ప్రకారం.. పెనమలూరు గ్రామానికి చెందిన బద్రినారాయణ ఈవోపీఆర్డీ శ్రీనివాసరావును మండల పరిషత్ కార్యాలయంలో గతేడాది డిసెంబర్‌లో దాడి చేశానని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ ఘటన నిజం కాదని పిటీషనర్ పేర్కొంటూ అనుమతులు లేకుండా ఈ ఘటనపై మండల పరిషత్ కార్యాలయం ఎదుట అధికారులు, సిబ్బంది ఆందోళన చేశారన్నారు. సీసీఏ రూల్స్‌కు వ్యతిరేకంగా విలేకరులతో మాట్లాడి తనపై ఆరోపణలు చేశారని చెప్పారు. ఈ ఘటనపై విచారణ చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్‌ను కోరానన్నాడు. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని పంచాయతీ రాజ్ కమిషనర్ జిల్లా పరిషత్ సీఈఓను ఆదేశించారు.

కానూరులో వృథాగా పోతున్న తాగునీరు

- లీకవుతున్న పైప్‌లైన్
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం




కానూరు వినాయక్‌నగర్‌లో వృథాగా పోతున్న తాగునీరు

పెనమలూరు: కానూరు వినాయక్‌నగర్ వాటర్ ట్యాంకు వద్ద పైప్‌లైన్ లీక్ అవుతుంది. గత 20 రోజుల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. దీంతో స్థానికులు తాగునీరు సమస్యతో ఆందోళన చెందతున్నారు. వివరాల్లోకి వెళితే తాడిగడప మున్సిపాలిటీ కానూరు వినాయక్‌నగర్‌లో స్థానికుల అవసరాలకు గతంలో వాటర్ ట్యాంకును నిర్మించారు. అయితే వాటర్ ట్యాంకు వద్ద పైప్‌లైన్‌కు రంధ్రం పడి నీరు వృథాగా పోతోంది. గత నెలలో ఈ సమస్యపై స్థానికులు మున్సిపాలిటీ ఏఈకి ఫిర్యాదు చేశారు. అయితే ఆయన మరమ్మతులు చేయిస్తానని చెప్పి.. పట్టించుకోలేదు. దీంతో మరలా స్థానికులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తానన్న అధికారులు పైప్‌లైన్ మరమ్మతులు చేయించలేదు. ప్రతి రోజు కుళాయిలు వదిలిన సమయంలో పైప్‌లైన్ నుంచి పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా రోడ్డు పైకి పోతుంది.

ఇప్పటికైనా స్పందించండి..
ప్రస్తుతం వేసవి కాలం కావడంతో నీటి సమస్య రాక ముందే అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఎందుకు స్పందించటంలేదని వారు ప్రశ్నిస్తున్నారు. పైప్‌లైన్ లీక్ అవ్వటంతో మురుగునీరు పైప్‌లైన్‌లోకి చేరుతుందని, వ్యాధులు ప్రబలక ముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకూడదు

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



అధికారులతో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నమవకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో ఉన్న సమావేశ హాలులో ఇంజినీరింగ్ సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని, ప్రత్యేకించి కొండప్రాంతాలకు ఎలాంటి లోటు లేకుండా తాగునీటి సరఫరా జరగాలని స్పష్టంచేశారు. అందుకు అనుగుణంగా కావాల్సిన వాహనాలను, వాటర్ ట్యాంకర్లను సమకూర్చుకోవాలని సూచించారు. జనాభా ఎక్కువగా ఉన్నచోట తాగునీటి సౌకర్యాలను మరింత పెంచాలన్నారు. నగర పరిధిలోని తాగునీటి ప్రాజెక్టులు, పార్కుల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందీ కలగకుండా, ప్రణాళిక సిద్ధం చేయాలని, ప్రస్తుతం ఉన్న అన్ని బోరులను ఉపయోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు నగరంలోని అన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎలాంటి నీటి లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా సర్కిళ్ల పరిధిలోని అసిస్టెంట్ ఇంజినీర్లు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల నుంచి వారు విధులు నిర్వహిస్తున్న వార్డు, ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను పరిష్కరించే దిశగా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు చర్యలు



పెదపులిపాకలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో శైలజ

పెనమలూరు: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును గుర్తించామని, రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె బుధవారం పెదపులిపాక, తాడిగడప గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మొక్కజొన్న, చెరుకు పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో రైతులకు పలు సూచనలు చేశారు. మొక్కజొన్న శాకీయ దశలో ఉందని, కత్తెర పురుగు కనబడుతుందన్నారు. దీని నివారణకు స్పైనోసాడ్ 60 ఎంఎల్, లేదా క్లోరంట్రానిలిప్రోల్ 60 ఎంఎల్ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. మొక్కజొన్న సాగు రైతులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పంటను పరిశీలించాలన్నారు. మినుము పంటలో అధికంగా ఎరువులు వాడితే మొక్క భౌతిక స్వరూపం మారిపోతుందన్నారు. మొక్కల ఆకులు ముదురు రంగుగా మారతాయని చెప్పారు. తగిన మోతాదులోనే రైతులు ఎరువులు వాడాలని తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలి..
రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ(పేర్లు నమోదు) చేసుకోవాలని ఏవో తెలిపారు. తాడిగడప ఆర్ఎస్‌కేలో రైతులకు సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. మండల పరిధిలో ఇప్పటి వరకు 1351 మంది రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు పేరు నమోదు చేసుకోవటం వలన ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏలు షరీఫ్, గోవర్ధని, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి చెత్తను వేర్వేరుగా సేకరించాలి



పెదపులిపాకలో కార్మికుడిని సన్మానిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి సంపత్‌కుమారి

పెనమలూరు: గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని డివిజినల్ పంచాయతీ అధికారి జి.సంపత్‌కుమారి తెలిపారు. పెదపులిపాక గ్రామంలో బుధవారం పెనమలూరు, తోట్లవల్లూరు మండలాలకు సంబంధించి గ్రేడ్ 1 టు గ్రేడ్ 6 వరకు పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, క్లాప్ మిత్రాలు, షెడ్ మిత్రాలకు తడి చెత్త–పొడి చెత్త సేకరణ, సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజినల్ పంచాయతీ అధికారి సంపత్‌కుమారి మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. అనంతరం సంపదల తయారీ కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించి ఎరువు తయారు చేయలని సూచించారు. పంచాయతీల కార్యదర్శులు ఎప్పటికప్పుడు క్లాప్ మిత్రాలు, షెడ్ మిత్రాలను ప్రోత్సహిస్తూ తగిన సూచనలు ఇవ్వాలన్నారు. అన్ని గ్రామాల్లో మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో ఇంటి, నీటి పన్నులు సకాలంలో వసూలు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన క్లాప్ మిత్రాలు," షెడ్ మిత్రాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెనమలూరు, తోట్లవల్లూరు ఈవోపీఆర్డీలు బొమ్మసాని శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వరమ్మ, పెదపులిపాక పంచాయతీ కార్యదర్శి ఓగిరాల తిరుమల వెంకటరత్నం పాల్గొన్నారు.

మన బడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న 'మన బడి–మన భవిష్యత్' కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సమగ్రశిక్ష జిల్లా పర్యవేక్షణాధికారి రమేష్ చెప్పారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల విద్యా వనరుల కార్యాలయంలో బుధవారం ఆయన ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. రెండో దశలో జరుగుతున్న పనుల పురోగతిపై ఆయన ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాలను అనుగుణంగా పనులు నిర్వహించాలని, పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు సీఎంఓ రమేష్ సూచించారు. ఎంఈఓ శ్రీరామ్ బాలాసింగ్, పంచాయతీరాజ్ ఏఈ డి.జయరాజు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



కృష్ణలంక(విజయవాడతూర్పు): స్థానిక 20వ డివిజన్ ద్వారకానగర్ రెండో లైన్‌లో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం బాధితులకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. విజయవాడ సర్కిల్–2 పౌరసరఫరాల శాఖ సహాయ అధికారి వి.శ్రీనివాసులు బాధితులకు ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కందిపప్పు, పంచదార, నూనె, కూరగాయలు, దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.